సమఉజ్జీలు

***

♦ మొదటి రీల్ ♦

చరణచాలనము! ఎదురు చిలుకల...ముత్యం కుచ్చుల పాంజేవులు... తడబడే విభ్రమంతో...ధీరంగా...అడుగుతీసి అడుగు...!

రెండవపాదంమీద...గమకంగా...వెడల్పు కుసుంబాచీర అంచు...మెరమెరలాడే...వైఖరి...!

ఎదురుగా...పురుషపాదవిన్యాసము ... తొందరగా.. తడబాటుకు సూచనగా...

—దృశ్యము విప్పారగా...ఎదురెదురై...సంభాషణలో... భేదాభిప్రాయము ... కోటికిరాగా...పట్టుదలతో మాట నెగ్గించుకోవాలనే గదమాయింపుతో...ఆమె! సామాన్య సంసారిణికి కొంచెం ఎబ్బెట్టుగాతోచే ... చలనచిత్రతారలకు ఉచితమైన ... సాహస వేషాలంకరణములు. రసికత్వము...తీరనికోరికలు...మెరసే చూపులు. లేతవయసు...

ఆతడు...కాయబారు ... వయసుమళ్లుతూన్న ... ద్వితీయ యౌవనాంతం చలాకీ మెరిపించడానికి ప్రయత్నించే... తేడా కనుపించుతూన్న దాంపత్యమునకు కారకుడు...రెండవపెళ్ళివాడు. ఇంకా పడుచు చూపులూ, ఆలోచనలూ...వదలనివాడు.

రాజీ కుదరనందువల్ల...ధూకుడుగానే నడుస్తుంది సంభాషణ. ఎవరూ వెనుదీయడమునకు సంసిద్ధులు కాలేదు. ఆతడు కొంచెం

తమాయింపుగా...అనునయింపుగా ... నచ్చచెప్పవలెననే...హద్దు మీరకుండా...ఏదో అపరాధం మాటు చేయవలెననే ఆదుర్దాతో... ఏలాగో సంభాషణ తెమల్చవలెనని—ఆమె...లొంగిపోకుండా... అనవలసినవి అన్నీ అని...తప్పు ఆతనిదేనని ఒప్పించి...మెదలకుండా చేయాలని...

‘నేను...ఒప్పుకోను...ముమ్మాటికీ.’

‘ఎందుచేత... ?

‘ఎందుచేత ఏమిటి,...నాకుయిష్టంలేదు.’

‘మరి...యింతకన్న వేరేమార్గం కనబడ...లేదు.’

‘నాకు అదేమీ తెలియదు. ఆవిడ...వంటమనిషిగా... ఉండటానికి నేను ఒప్పుకోను.’

‘నేనిక ఉరిపెట్టుకోవాలి...! ఏంచేయను, ఊరంతా గాలించినా...వంటవాడన్నవాడు ... సజావైనవాడు దొరకలేదు...! ఉన్న ఆ ఒకరిద్దరికీ...పాతికా, ముప్పైకావాలట...’

‘అయినా సరే...మగవాణ్ణే కుదర్చండి!’

‘ఏం...ఆడది ఉండటానికి నీవు ఒప్పుకోకపోతే...మగవాడు ఉండటానికి...నేను ఒప్పుకోను...’

‘అయితే...మానేయండి.’

‘నాకేం... వంటభారం నీమీదనే పడుతుంది.’

‘నాచేత... గరిటె పట్టించి...తప్పేలదింపించుదామనే!...’

‘...నా దగ్గర, ఆ తాహతు ఉంటే...నీవు ఎందుకు ఇలా ఆడుతావు?...ఎట్లా అవస్థ..?’

‘హోటలునుంచి...’

‘మా బాగుంది...! సంసారమంటూ ఉండి...నెలకు ఎనిమిది వందలు ఉద్యోగంలో తెచ్చుకుంటూ...యింట్లో నీకు ఏ రోగము

రొచ్చులేక...హోటలునుంచి తెప్పించనా భోజనం, పూట పూటా? ... అప్రతిష్ఠ.'

'అయితే...మీ యిష్టం.'

'పోనీ, మీ పినతల్లికూతురు సుందరమ్మను... మళ్లా పిలిపించు...'

'...ప్రాణం పోతూన్నా...దాన్ని ఇక, ఈ గడప తొక్క నీయను. మీకేం చెపుతారు! బయట తల ఎత్తుకు తిరగ నక్కర లేదూ... ? ఇదివరకు...అయినదానికే...'

—ఇద్దరూ పూర్వస్మృతిని...మననం చేయడం అభినయిస్తూం డగా...దృశ్యం...మబ్బుగా అయిపోయి...మాయమయి...క్రొత్త వెలుగులో...

వీధివేపున కిటికీకి...కొంచెం ఎడంగా...తారసలాడుతూ, వైధవ్యముద్రతో ... మామూలు వేషంతో ... పడుచుపిల్ల... సుందరమ్మ...

కిటికీ అవతల...రోడ్డుమీద...నిదానించి యింటివేపు చూస్తూ... సైగలు విసురుతూ...మనోహర నేపథ్యంలో... యువకులు...

—మాయమై...మరోదృశ్యము...! వెన్నెలలో...బాగా ప్రొద్దుపోయిన తరువాత...

...బాల్కనీలో... బెదురుతూ...అలికిడి కానీయకుండా... ఎదురుచూస్తూన్న సుందరమ్మ. క్రమంగా దృష్టిగోచరుడైన... ఎవరో యువకుడు...! ఇరువురూ...పరిచయం ఉన్నవాళ్లులాగా... సైగలతో మాటాడుకుంటారు...

వాళ్ల ధోరణిలో వాళ్లు ఉండగా... వెనుక...హాలులో చప్పున దీపంవెలుగు. వెలుతురులో...ఆమె...!చూసి సుందరమ్మ చకితఅయి...గాభరాతో లోపలికి పారిపోతుంది. ఆమె... బాల్కనీ

లోకి వచ్చి...చీకటిలో మరగిపోతూన్న...మనిషి ఎవరో ఆనవాలు పడదామని నిశ్చలంగా చూస్తూ...

—కమ్ముకువచ్చిన దృశ్యం. సుందరమ్మ దీనవదనంతో... బండిలో కాలు పెడుతూంటుంది...ప్రయాణమైపోతూ.

మళ్లా...యథాప్రకారం మొదటివిధము...సంభాషణ.

'అప్పుడే ఏలా మరచిపోయినారండీ...? అయినవాళ్లూ, కానివాళ్లూ...విడ్డూరంగా చెప్పుకుని...'

'ఏలా ఏడుస్తుంది, మరి: ప్రతిదానికీ ఏదో ఒక వంక...! ఎందుకూ, కలిసిరావాయె: ఇదే, నీతోఅవస్థ...! ఏడాది కాలేదు, కాపురానికివచ్చి...వేధించుకుతింటున్నావు.'

'మాటకుమాట తెగులన్నారు...! తీగ కదిలిస్తే...! అయినా, గుమ్మడికాయల దొంగా అంటే...మీరు భుజాలు తడుముకోటం ఎందుకూ?'

'లేదులే...వెయ్యిమంది లాయర్లను చంపిపుట్టావు...! మాట అని నీతో గెలవగలనూ?...ఈసారికి ఇల్లాపోనీ...నామాట విను కాస్త. గుమాస్తాతో చెప్పాను; రేపటినుంచీ వస్తుంది ఆమె...'

'రావద్దని కబురుచేయండి...మీకు, చేతులో మనుష్యులు కొదవా?'

'బాగుండదు...నగుబాటుపని...బ్రతిమాలుకుంటాను... నా పరువు దక్కించు...'

'...సరి...కాని, ఓ కండిషను. ఎప్పుడుపడితే అప్పుడు పొమ్మనడానికి...నాకు అధికారం...'

'ఆలాగే. అయితే...కారణం ఏమిలేకుండా...'

'...కారణం లేకుండా...నేనేపనీ, చేయను...'

'అవును...నాకు తెలియదూ, నీ సత్తా?'

'అదిగో...ఆమాటలే...అనవద్దన్నది...'

'నాకెందుకు బాబూ... ఆఫీసుకు వేళ అయింది... వెడుతున్నా...'

—ఆతడు నిగ్రహించి...తిరిగి, ఆఫీసువేషములో...తలగుడ్డ సర్దుకుంటూ...గుమ్మందగ్గరనిలిచి వెళుతున్నానని...చెపుతాడు. ఆమె...చూస్తూనే,జవాబుచెప్పదు. ఆతడు...చూపులుకలిపి, ప్రసన్నను చేసుకుందామని...మసలి...ప్రయోజనం లేక...చిన్నబుచ్చుకుని...అడుగు వెనుకకువేసి...చాటు అయిపోతాడు.

వెళ్ళినతరువాత...ఆమె చిరునవ్వుతో, విజయగర్వంతో... ఆతడు కనబడినవైపు చూపు మరల్చి...చూసి...ఆలోచనలో... ఏదోధ్యాసలో... తమలపాకులచిలుకలు అందుకుంటూ... సన్నని గొంతులో...పాడుతూ...!

కొన్నాళ్లకు: భోజనములముందు ... ఉభయులూ కూర్చుని ...ఎదురుగా...మాటలాడుకుంటూ నిదానంగా భోజనం చేస్తూంటారు. వంటఆమె...మాంచి, కట్‌మస్తీగా, కాంక్షణీయంగాఉన్న భారీమనిషి...వడ్డన...సహజవయారంతో...చేస్తూంటుంది. ఆతడు, గృహిణి కన్నొరగి...వంటఆమెను...చూపులతో ఎకసెక్కెము చేస్తూ...చిరునవ్వు పంచుకుంటూంటాడు. ఆమె, ఓరగా...యీ వైఖరి గమనించుతూ...కోపమూ, అసహ్యమూ, ప్రత్యేకంగా... స్పష్టంగా...పూర్ణాననంలో కనపరుస్తూ ... ముభావంగా ... భోజనంతో...ఆడుకుంటూ...సమయంకాచి దుమికే ఆడుపులి ఊలంతో కూర్చుని ఉంటుంది.

ఆతడు...ముగించి... లేచి, ఆమెవంక చూడకుండా వెళ్లిపోతాడు. ఆమె, కంచం వదలి...తొందరగా వెంటనంటి...

హాలులో...తువాలతో...చేతులు తుడుచుకుంటూ... దుస్తులకోసం స్టాండును సమీపించుతూండగా...విసవిస...వెనుక

నుంచి అమ్ములాగా... వేగంగావచ్చి...నిలవేసి...గర్జనతో...చీవాట్లుగా—

పట్టుపడిపోయినాననే బెదురుపాటు...ఎలాగైనా తప్పించుకుని బయట పడవలెననే ఆతురత...ఆతని కవళికలో...!

చిక్కినప్పుడు...అంతు పూర్తిగాకనుక్కొని...సంగతి తేల్చివేయదలచిన...నిశ్చయం, దీక్ష...ఆమె వాలకంలో...!

'మీ...పరివర్తన...నాకు ఏమీ బాగుండలే...!'

'ఒకప్పుడు...నచ్చిందా ఏమిటి నీకు...!'

'ఎంచడం మొదలుపెడితే...సంచులు నిండుతాయి...! అవన్నీ ఎందుకూ...ఇప్పటిమాట...'

'ఆలాగే మరి...'

'వెధవ కబుర్లుచెప్పి ... సంగతిమాటేయడంలో... మొనగాళ్లు...! చెప్పండి...నేను అడిగేదానికి సరిగా సమాధానం...'

'లేకపోతే...'

'ఏంచేయాలో...అదేచేస్తాను...!'

'అంతవరకూ వచ్చిందీ...'

'ఆఁ—'

'ఇంతకూ...అసలు ఏమిటి ?'

'అదే...నిలవేసి అడుగుతూన్నది. మీ పరివర్తనఏమీ బాగుండలేదు. నేను ఒప్పుకోను...మీరు నూరుచెప్పండి వేయిచెప్పండి. భోజనానికివచ్చింది మొదలు...లేచేదాకా...వంటదాని వంక...అదేపనిగా ఓకే చూడటమూ ?'

'చూపులో...ఏమున్నదీ ?...'

'దోషం...'

'గంతలు కట్టుకుంటాను...'

'ఏమన్నా కట్టుకోండి' ఇఖ— సాయంకాలమునుంచీ... ఆవిడకు ఉద్వాసన!'

'...చెప్పేశావా, ఏమిటి?'

'కాసేపుండి...చెప్పాలనుకుంటున్నాను.'

'నీపుణ్యమాయెను...రెండురోజులు ఓపికపట్టు ... అమ్మాయీ, మేనమామ వస్తారు, రేపు; వాళ్ళువచ్చి వెళ్ళిందాకా... కాస్త...'

'సీత...ఉత్తరం వ్రాసిందా?'

'మరే...యీాస్టరుకు...తాతగారి ఊరువచ్చిందట. నన్ను ఓమారు చూసిపోదామని, ఇక్కడకు...'

'ఇక...కూతురుగొడవలో...పడతారు...కాబోలు...'

'నువ్వేమన్నా...నాకు తప్పుతుందామరి, కన్నకడుపు. ఎందుకొచ్చింది. మీ యిద్దరికీ సరిపడదుగదా అనే...దాన్ని మేనమామగారియింటికి పంపించివేశాను. చదువుధోరణేమో... అదేమో...'

'ఇటువంటివే...వద్దుమండేవి: ఇరవై ఏళ్ళు శరీరంమీదికి వచ్చి, పెళ్ళి పెటాకులూ చెయ్యక...పట్నంలో మెడిసిన్ చదివించడమూ? పట్నవాసంలో...స్వేచ్ఛలో...ఎందుకన్నా...ఇక పనికి వస్తుందా...?'

'దాని...సంగతి...'

'ఆఁ... అందరిసంగతులూ కాచివడబోసినవే... చెప్పక్కర్లేదు...! దీనంతకీ తోడు...ఆ మేనమామ సహవాసమా? పెళ్లాన్ని విడిచిపెట్టి...ఏదో ఆర్టు-గీర్టు అంటూ అడ్డమైనవాళ్ల బొమ్మలూ గీస్తూ...అల్లరిగా, తెగిన గాలిపడగలా తిరిగేవాడా— మీఅమ్మాయికి గార్డియన్ !...ఏం చక్కగా ఉందీ?...'

‘ పోనీలెస్తూ...అదంతా నీ కెందుకు...’

‘ అవును...లేకపోతే, నా కెందుకు...! ఇంతకూ లోకానికి వెరచికాని...వాళ్ల వాకిలి తొక్కేందుకైనా వప్పుకుంటానా ?...’

‘ పాపం...పుణ్యం...లోకభయం...’

‘ నాకు...ఆలాటి పిచ్చి వేషాలు ఏమీ లేవు...! పాపం!...అది లేకపోతే ... చక్కని పాపం చేయకపోతే...జీవితపరిణామం పక్వము కాదని...నా మతం...! ’

‘ ఓహో...’

‘ ఈహీం...! అందులో ఉండే ఉత్తమాదర్శం...విశిష్టలక్ష్యం ...తెలిస్తే కాదూ, ఒకటి అసలు ! అభిమానం...పట్టుదల...పోకైన తలతిక్క...ఇవే లేకపోతే... జీవితం నగిషీకి మెరుగే వుండదు! ’

‘ ఇన్ని ఉండి...నడవడి అనేది... ’

‘ నడవడి !... లేకపోతేమాత్రం ఏం ? ... జీవితంలో, నడవడి...అన్నిటికన్నా ముఖ్యం అనేది...వట్టి చచ్చుసిద్ధాంతం...! ’

‘ అవును లే...వ్యక్తిత్వమును రెచ్చిపోనీయడానికి తలపెట్టిన...మహానుభావవు... ! ’

‘ ఆత్మాభివృద్ధే కాదూ...జీవితోద్దేశ్యం ! ’

‘ ... నేను...నీతో వాదించలేను... ’

‘ కనబడుతూనే ఉంది... వేరే సెలవియ్యాలా... ? ’

‘ ఏమనుకున్నా సరే...! ఇంతకూ...అసలుమాటపోయి యీ ధోరణిలోకి దింపావు. నేను చెప్పినది జ్ఞాపకం ఉన్నదా...తీరా అభాస చేశావంటే... ’

‘ ఇంకో నింద నామీద పడుతుంది...అంతేకాదూ... ? ఇది వరకు...కూతురికీ మీకూ కాకుండా చేశాను. ఇప్పుడు...యింటికి వస్తే...దేవిగారు దయచేశారని... వంటమనిషి లేకుండా చేశాను... !

కానీయండి...అన్నిటికి...ఒడిపట్టేఉన్నాను. మీకు ఆ భయంలేదు లెండి. ఇక ఈ నాలుగురోజులపాటూ, చూపులకు...తీరిక ఉండదనుకుంటాను... ? ఎంతకైనా...మగవాళ్ళు... '

—మాటల ధూకుతులో మునిగి, ఇద్దరూకూడా, వంట ఆమె వచ్చి వేచివున్న విషయం గమనించరు. ఆమె...సంభాషణ... పొంచివుండి వినే సహజ- అలవాటుతో, కొంతసేపు ఆలకించి, అర్థం కానందువల్ల, విశేషించి తనకు సంబంధించినది కానందువల్ల మొగంలో, ఉత్సాహము లేకుండా...తేలుకుట్టిన దొంగలాగు...తప్పనిసరి అయి...చిరుదగ్గుతో...తాను వచ్చానని...ఏకాంతమునకు భంగము కలిగించుతుంది.

'ఏం... ? '

'మధ్యాహ్నం ఫలాహారం...ఏమిచేయమంటారు...? '

'ఏమండీ ..దూద్ పేడా...జిలేబీ... '

'నీయిష్టం... '

'సరే...అవి చేయవమ్మా ! ఇదిగో... రేపు బంధువులు వస్తున్నారు...పట్నవాసం...వింతవింత రుచులవారు... ! ఏలా మెప్పిస్తావో... నేను మళ్ళా చెప్పక్కర్లేదు. అమ్మాయి...ఏదిపురమాయించుతే...నిమిషాలమీద అది అమరించాలి... తెలిసిందా...? '

—వంటఆమె ముఖంలో...ముప్పుతప్పించుకున్న ...బ్రతుకు-జీవుడా-భావం ..! ఆతని చర్యలో...తుపానుదెబ్బ తగిలి తెప్పరిలుతూన్నమాను...పోలికలు... ! ఆమె నయనాంచలములలో...సర్వతోముఖ విజయపాండితి...!

...కమ్ముకుంటూన్న మబ్బులో...వంట ఆమె వెళ్ళిపోవడం, ఆతడు...షర్టు అందుకునేధ్యాస. గెలుపు మెరిపిస్తూ నిలిచిపోయిన...ఆమెచూపులు...

—హారన్ ! ... కారు, దూకుడుగావచ్చి ... బ్రేక్ పడి, ఠఫీఅని ఆగిపోతుంది. సీడన్ బాడీ అద్దం తెరలోంచి ... షాఫర్ ... చప్పునదిగి...దిగుతూ, తలుపునొక్కేసి...

కారు...సరాసరి: డ్రైవరు, తలుపుతీసేదాకా ఉండకుండా... సీత, చలాకీతో క్రిందకు ఎగిరిదూకి...గబగబ యింటిమెట్లుఎక్కి ... మధ్యలో ఆగిపోయి...ఓరగా వెనుక తిరిగిచూసి...అనుసరించమని తలవిసిరి సైగచేసి...వెళ్లిపోతూంటుంది. కారులోనుంచి...నిదానంగా దిగిన ... కళాభాయి వేషధారి, ఉత్తరీయం ... పైటమాదిరిగా అంచులు సర్దుకుని, లెక్కగా అడుగులువేస్తున్నట్టు... కదులుతాడు.

డ్రైవరు... సూట్ కేసులు, జవానుకు అందించుతూంటాడు.

— కొరైడార్. ఆతడు మొగలాయి పాపోసులతో...యింటిలో వేసుకునే కంబెమెడ...సగం చేతుల చొక్కాతో...ఒక చేత... నేలజీరాడేలాగు...పత్రిక ... ఇంకో చేతితో ... సులోచనాలు తీసి వేస్తూ...

కారునుంచి దిగిన అమ్మాయి...ఆతనినిచూచి...సూటిగా లేడిపిల్లలాగు ... ఉత్సాహంతో ... సమీపించి ... భుజములమీద చేతులు వేసి—

'నాన్నా...'

'...వచ్చావూ...తల్లీ...'

'ఏం...చిక్కిపోయినావు...'

కొంచెందూరంగా...రంగానికి వెనుక హూనంగా, నిలుచుని ఉన్న...ఆమె...కనబడి...అందుకుని—

'నాపోషణలో...చిక్కిపోక...ఇక ఏలా ఉంటారు ?...వచ్చావామెను...ఇక బలిపించు...'

మనసు చివుక్కు–మనడం ... ఆతని విషాదవదనంలో ... ! ఆ అమ్మాయి... తెల్లబోవడంలో... ఆతను తల... వంచుకుంటూంటాడు. సీత... భావపీడనను... ప్రసన్నతమాటున బలవంతాన దాచేస్తూ...

'ఏం... పిన్నీ... కులాసా ? ... క్రొత్తసాధారాలు అందినమాలే వాత్రి శావుకాదేం... ? అన్నిరంగులూ వచ్చినాయా... '

—కళాభాయి మందగమనంతో...

'ఏం... బావా ! వయసు ముదురుతూన్న కొద్దీ... బాల మెరుపు వస్తూంది.. గుమ్మడిపండు వవుతున్నావు ?..

ఆతడు ... చిరునవ్వుతో ... ఇంకా దీనంగానే ... మూగగా స్వాగతం చూపులతో అందించుతాడు...

...సీత, తండ్రిని ... మేనమామను ... చూసి నవ్వుతుంది. అందరూ ఓక్షణం కదలకుండా నిలుచుని...

...కళాభాయి... బెరుకుగా... ఆమెవంక చూస్తాడు. ఆమె... చూసి, చూపు ... చురచుర లాడించి మరల్చుకుంటుంది. ఆతని ముఖం... మేఘుచ్ఛన్నమౌతూ...

...సీత... మేనమామ ఉత్తరీయం విప్పిస్తూ...

'పెళ్ళినడకలేం ... మామా ... ? పోయి వేగిరం స్నానం చెయ్యి. కాఫీ తీసుకుని ... తరువాత నిదానంగా ... మాట్లాడుకో వచ్చును... '

...డ్రైవరు ... యీజెల్ ... స్టాండు ... చెరొక చంకను,— వెనుకాల, సూట్ కేసులతో, జవాను.

—సాయంకాలము ... నీరెండ ... పొద్దువాలిపోతూన్నది. మేడమీది ... వసారాదరిని పిట్టగోడమీదుగా వంగి ... నిరీక్షిం చుతూ ... సీత. వెనుక ... ఆమె...

...క్రింద...కారు...వచ్చి ఆగుతూండగా లోపలనుంచి... మేనమామ...తల...కనబరచి... చేయివిసురుతాడు: సీత జవాబు యిస్తుంది.

'పిన్నీ...షికారు వెళుదాము...రావూ ?'

'రాను...'

'రా...సర్దాగా...ఉంటుంది...'

'మధ్యను...నే నెందుకు... పానకంలో ... '—శేషమును ...చూపు-హేళనతో పూరించి ఆమె లోపలికి వెళ్ళిపోతుంది. సీత...మనసు చివుక్కు-తో...మెట్లుదిగుతూ...

—కారులో...పరధ్యానంగా...సీత... అచ్చెరువుతో...మేన మామ...చేయిపట్టుకుని, కదిలించి—

'ఏమిటి...మూగనోము...'

సీత సిద్ధాంతమును ప్రతిపాదించే ధీరనిశ్చయముతో...

'మనం...ఇక్క డకు రావడం...పొరబాటు.'

'ఏమీ ?'

'ఆమెకు ... యిష్టము లేనిదీ... నాన్నకోసమే అనుకో... అయినా... '

కళాభాయి...పక్క-కు చూస్తూండగా...ఝూకుడుగాపోతూన్న కారులోంచి...ఆతని మొగం...తళుక్కు-మంటుంది. సరసను ఇంకో జవ్వని ఉన్నట్టు...చూచాయ...

మామ...సీత గమనించకపోవడంచూసి...తేరుకుని...కలవరం దాచేసే నవ్వుతో—

'నీవి...అన్నీ వట్టి అనుమానాలు... '

'నీవు ఎప్పుడూయింతే...ఏమాట చెప్పినా...!

'ఎక్కడకు... వెళుదాం...'

'నీ యిష్టం... నాకు... కులాసా అంతాపోయింది...'

'నన్ను చూసి... నేర్చుకోరాదూ...'

సీత... నిశ్చలంగా చూసి... అప్రియత్నంగా... అతని నవ్వులో ...తనహాస రేఖను... కలుపుతుంది.

—డ్రాయింగ్ రూమ్: అతడు... పచారు చేస్తూ... ఆలోచనలో ఉంటాడు... మధుర భావనలో మునిగినట్లు... ముఖాన... కళ.

సీత... బెరుకుగా... తండ్రిని సమీపించి ... మాటలు సాగిన కొద్దీ, ధైర్యంతో—

'నాన్నా... మామయ్యా, నేనూ... రేపు వెళ్ళిపోతాము...'

అతడు ... కంగారుగా— 'అదేమిటమ్మా ... మొన్న నే వస్తిరి... ఇంకో నాలుగైదు రోజులు ... సెలవలు అయిపోయే దాకానైనా...'

'ఎందుకు లెస్తూ ... ఆవిడ రుసరుసగా... అయినదానికీ కాని దానికీ చీకాకుపడుతూ... విసుక్కుంటూ... సన్న సన్నగా ... సూటీపోటీలు అంటిస్తూ...'

'అవును... ఇవాళ కొత్తేముందీ ?... మామూలేగా... ! ఇంతకూ, నాముఖం చూసివచ్చావు. కాని...'

'అంతేమరి. పోనీలే, శనివారందాకా ఉంటాము. ఆవేళ యింజనీయరుగారి అమ్మాయి అన్నప్రాశనట. ఆమె వస్తే నే కాని వల్లకాదని మరీమరి చెప్పింది. సరేలే...'

'కానీ అమ్మ !... నీయిష్టం... తండ్రినై ఉండికూడా, ఇంత అశక్తుణ్ణి అయిపోయినాను ...'

'ఎబ్బే... విచారపడకు నాన్నా ...! మాటవరుసకు అన్నాను. నీవు నాకు చేసిన లోపం ఏమిటి ? వేయికళ్ళతో ...కనిపెడుతూనే ఉన్నావు...'

...వింటూన్నకొద్దీ పొంగివస్తూన్న విచారాన్ని...ఆమెచూడ కూడదని...మిషతో...మాటమార్చి—

'అదుగో... మామఎందుకో నిన్నుపిలుస్తూన్నాడు ... ఏం కావాలో కనుక్కో...'

తండ్రివేదన గ్రహించిన చూపులతో... సీత...సాలోచనగా...వెనుదిరిగి...అడుగులువేస్తూ.

ఆతడు...ఆమెవంకచూసి...ముంచుకున్నపరితాపంతో... తల కుంగి...వాలిపోతూ.

—ఆయింటిలో...కళాభాయి... విడిసినగది కిటికీదగ్గర... కాలు గోడకుతన్నిపట్టి...కుర్చీ వెనుకకునెట్టుతూ కూర్చుని...పెన్సలుతో...స్కెచ్...ఊహతో చిత్రించే ధ్యానంలో ఉంటాడు.

ఆమె...గదిఎదుట...గుమ్మంలో కనబడి...లోపల ప్రవేశించే సూచన కనబరచి...తప్పుకుని... ఒక నిమిషముండి...మళ్ళా వచ్చేస్తుంది...

సీత అనుకుని...చిత్రం మీద ధ్యానమును హుషారుగా మరల్చిన మామ...ఆమెను చూసి... తెల్లబోయి...సంభ్రమంతో ... రాకకు కారణం ఊహించలేని చూపుతో ... కొంచెం ఆశతో...

'మీరా...'

'అవును...ఏం అలా ఉలికిపడ్డారు...'

'ఏమీ లేదు...సీత అనుకున్నాను...'

'సీత...ఇంజనీర్ గారింటికి వెళ్లింది...'

'బావ...ఏంచేస్తున్నాడు...'

'ఆయన...కార్‌లో...ఉడాయించారు. ఏమిటో...బొమ్మ వేస్తున్నారులాగుంది...నేను చూడవచ్చునా...?'

'ఆఁ...ఏమిటో...మీరు చూడతగినంత...'

'పోనీలెండి. నాకు బొమ్మలంటే ప్రాణం, అందుకని అడిగాను...'

'దాసు...ఎరుగున్నారుకాదూ...మేమిద్దరం...చిన్నప్పుడు సావాసం...ఇరుగూ పొరుగూ.'

'అలాగేం...నేనూ ఆతడూ...బొంబాయిలో కలిసి నేర్చుకున్నాం...'

'మొన్ననే...ఈమధ్య వచ్చి వెళ్లాడు ... ఎంతబాగున్నాయనుకున్నారు బొమ్మలు...! మీరు...మీ చిత్రాలు ఏమన్నా పట్టుకు వచ్చారా...?'

'లేదు...'

'అవును లెండి...అవసరం ఏమున్నదీ, ఇక్కడ...?—నా బొమ్మవ్రాస్తా నన్నాడు దాసు...నేనే...ఎందుకని...'

'ఆ వరం...నాకు...ఇవ్వకూడదూ...మీరు'

—మామ...లేచి...నిలుచున్న ఆమెను సమీపించుతాడు. ఆమె చలించకుండా—

'మీరు...ఆర్టిస్టు...గీతలలో నేనా...'

'...చేతలలో...కూడాను!'

...కొంటెగా...కోప మేమీ లేకుండా...మామ వంక ధైర్యమిచ్చే చూపుతో—'ఏం జాణలండీ...! ఆయిల్సులో కూడా చేతనవునా అని...నే ననబోయింది...'

'పరీక్షకు...తాళిన తరువాతనే...'

'తరువాత...'

'బహుమతీ...! ఎంత అందంగా ఉన్నారు...'

'నిజం...'

'మీ...కళ్ళు...'

ఆమె...సిగ్గు మాయం అవుతూన్న...కాంక్షతో— 'ఏమంటున్నాయి... ?'

'నన్ను...మరువవద్దు...అని...చక్కిలిగిలి...'

'మడిగట్టుకునే...'

—రెండు ప్రేమవాహినులూ ఏకమయే విభ్రమ సన్నివేశం...! మరీదగ్గరకు వచ్చిన ఆమెను...మామ కౌగిలిలోకి లాగుకుంటూండగా...

—ఏకాంతం. అలలు దగ్గరకు తగిలేలంత సమీపాన... సముద్రం ఒడ్డున...మసకచీకటిలో...

ఆతడు ఆనుకుని...ఇంకో శ్వేతకన్య...ఏకంగా...ఒకఫోటోను చూస్తూ...పారవశ్యంతో...ఆలింగనం...

—తోటలో...సీత...వికర్ కుర్చీలో చిన్నబల్లదగ్గర కూర్చుని, చదువుకుంటూ...

...వంటఆమె...కాఫీతీసుకునివచ్చి...అమర్చుతుండగా...

'ఎన్నాళ్లైంది... నీవు...ఇక్కడకువచ్చి ?'

'రెండో నెల...జరుగుతూంది తల్లీ...'

'ఇంతేనా...'

'ఇదన్నా...పూర్తిగా అయితే...'

'అదేం...'

'మీరు వెళ్ళగానే...నాకు ఉద్వాసన...'

'ఆఁ...హాఁ...'

'నేనంటే...ఆవిడకు యిష్టంలేదు...'

'ఏం...'

'చూసి...ఊరుకోకపోవడంచేత...చేసే పనులకు...హద్దు లేకుండా...'

'అపవాదులు...'

'చూసిన కళ్లు...ఇవిగో. ఆవిడను కాదనమను...? మీ మామా...అవిడా...మీరు యింటో లేకుండాచూసి... ఆడిన నాటకం...'

'సరేలే... నీ కెందుకు...వెళ్లు...'

'చాడీలుకావు తల్లీ...అంచాయించే యిన్నాళ్లనుంచీ... ఎందుకైనా మంచిది...వివేకవంతురాలవని...నీతో చెప్పాను...'

'బాగుంది...'

'ఆయనకూడా...'

'ఇక...చాలించు...'

'కోపమా అమ్మా!...'

'ఎవరిమీద...? కోపమేమిటి...కూలిపోతూంటే...'

—సీత...ఆలోచించుతూ...షాక్‌నుంచి తెప్పరిలని తొట్రుపాటుతో...నడుస్తూవుంటుంది. ఆమె ఎదురవుతుంది. సీత...తల ఎత్తదు:

ఆమె, సీత చెయి పట్టుకుని— 'నీకోసమే... వెదుకుతున్నాను...'

'నల్లపూసనా...కనబడకపోవడానికి...అందులోనీ కంటికి?'

'ఓమారు...నా గదిలోకి...రా...'

'ఎందుకూ?'

'రా...నీకే అర్థమవుతుంది...'

'అన్నీ...అర్థమవుతూనే ఉన్నాయి...'

'ఆలాకాదు...'

బలవంతంగా...సీతను గదివేపు నడిపించుకుని వెళ్లి...

...గదిలో...ఆమె చెయి విడిచేసి...బీరువా తాళం తీసి... కవరు అందుకుని...ఫోటో తీసి...సీతకు అందించుతుంది.

...సీత...నమ్మలేని చూపులతో ... చూసి ... ఆమెవంక చూసి...చూపు మరలించుకుంటూ...

...జారవిడుస్తుందేమోనని...ఆమె...ఫోటోను లాక్కుని... జయగర్వంతో—

'మీ...నాన్నగారి...ప్రతాపం...'

'నా...దురదృష్టం...'

'చేసుకున్న పూజలు...! తక్కువనోములు నోచి...ఎక్కువ వరా లడిగితే...ఏమనుకున్నా ఏం లాభం...? చూశావా...దంప తులని...!'

'ఆమె... ఎవరు...?'

'ఎవరో...నర్సు...'

'ఎవరైతేనేం...ఎన్ని పెళ్లువచ్చినా ...'

'నా గొంతు కోయడం... మీ నాన్నకు...'

'తెలిసికూడా, నీవు చూస్తూ...'

'ఏంచేస్తే నేంప్రయోజనం... ? పుర్రెను పుట్టినబుద్ధి...'

'తండ్రి... ఉద్ధృతంగా వచ్చి...సీతను, ఆమెను చూసి... వెనుకకు తగ్గి:

సీత...ఆయనను చూసి...చేతిలోని డ్రాయింగ్ కాగితం... పోలికపట్టి గ్రహించి...తొందరగా ఆయన దగ్గరకువెళ్ళి...లాక్కుని నివ్వెరబోతుంది.

ఆమె నేరం బయలైనది అనే తత్తరపాటుతో...ఎటు మసల డానికీ తోచనిదానిలాగ...నిలిచిపోతుంది.

ఆతడు...విజృంభించి...

'చూశావా... మీపిన్ని ...ఘనకార్యం...'

సీతను జవాబు చెప్పనీయకుండా...మాటలజడి కురిపించుతూ...

'సంసారికాదూ...? వావివరుసలు అక్కరలేదూ...? ఏమిటి...ఈ బొమ్మ...! ఆ...పుంఢాఃకోర్ ఎంతకైనా తెగించినవాడే...? దీనికి!... దీనికి మానాభిమానములు చచ్చిపోతే... వాణ్ణి అనడం ఎందుకూ...? సిగ్గు విడిచి...ఆలా...కనబడుతూ... బొమ్మ గీయనిస్తుందీ...ఛీ...'

'నాన్నా...'

'ఇంకా ఎక్కడి నాన్న... పరువుపోయినతరువాత...బ్రతకడం...ఎవరికోసం...?'

'ఒకరుపోతే... ఇంకొకరికోసం,...! ఇదుగో... యిస్త్రీవాయనం, పుచ్చుకుంటివాయనం...! పిన్ని కంప్లైయింట్...'

ఆతఁడు...ఫొటోను చూచిబెదిరి...ఆఁ...ఆఁ...అని...నిరుత్తరుడౌతాడు. ఒక నిమిషం...ఇద్దరూ నిర్జీవప్రతిమలు...! సీత...అందుకుని—

'బాగానే ఉంది...! ఎవరంతవాళ్లు వారయినప్పుడు...ఎవరి సాహసం వారికున్నప్పుడు... చెప్పేదిఏమున్నదీ?...సమఉజ్జీలు!'...

...సమఉజ్జీలు అనడంలో...సీతమనసులోని విషాదమంతా ...విరక్తి...అసహ్యము అంతా ధ్వనిత మౌతుంది.

...ఆతడు...తల ఎత్తకుండా...తప్పించుకుని బయటపడతాడు. ఆమె...మంచంమీద వాలిపోయి... మొగం మాటుచేసుకుని... వెక్కి వెక్కి...

...సీత...ఆమెను చూసి...చులకదనంతో ... మెరసే కన్నులతో...గర్జనతో—

'సమఉజ్జీలు!'

* *
*